# కాంగ్రెస్, బీజేపీలతో ప్రమాదం

నమ్మితే మోసపోతం.. సంపదనంతా దోచుకుంటరు

- దేశాన్ని, రాష్ట్రాన్ని ఏండ్లకేండ్లు పాలించి చేసిందేమీ లేదు
- మరోసారి ఆశీర్వదించండి.. అభివృద్ధిలో టాప్‌లో నిలుపుతా
- మంత్రి గంగుల కమలాకర్



11వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 1: 'కాంగ్రెస్, బీజేపీలతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. వారు చెప్పే మాటలు, ఇచ్చే హామీలు నమ్మితే మోసపోతం. తెలంగాణలో పెరిగిన సంపదను, కరెంట్, నీళ్లను దోచుకపోతరు. మళ్లీ వెనక్కి పోతం' అంటూ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం నగరంలోని 11, 1, 2, 4, 5, 27, 6 డివిజన్లల్లో రూ.133 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేసి, మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని తెలిపారు. తెలంగాణ రాకముందు నగరంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉండేవని, గత ప్రభుత్వాలు 70 ఏండ్ల పాలనలో నగరంలో చేసింది శూన్యమని మండిపడ్డారు. రోడ్లన్నీ గుంతలతో అధ్వానంగా ఉండేవని, పక్కనే మానేరు డ్యాం ఉన్నా మహిళలు మంచినీటి కోసం ఎన్నో తిప్పలు పడ్డారని గుర్తు చేశారు. ఇప్పుడు స్వరాష్ట్రంలో రోడ్లు ఎలా ఉన్నాయో..? అభివృద్ధి ఎలా సాగిందో మీ కండ్ల ముందే కనిపిస్తున్నదని వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోకపోవడం వల్లే ఇక్కడ ఆ పార్టీకి స్థానం లేదన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు మూడుసార్లు అవకాశం ఇచ్చారని, ప్రజల రుణం తీర్చుకునేందుకే నగరాన్ని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ కాంగ్రెస్, బీజేపీలు వస్తున్నాయన్నారు. తెలంగాణ వస్తే గుడ్డిదీపం అవుతుందన్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు బీజేపీ ముసుగు వేసుకొని వస్తున్నారని, కాంగ్రెస్ ముసుగులో షర్మిల, రాంచంద్రారావు వస్తున్నారని విమర్శించారు. మన నిధులు, నీళ్లపై కన్నేశారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేసుకున్న తెలంగాణను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్‌ను పర్యాటక కేంద్రంగా మార్చుకుంటున్నామని, ఇప్పటికే కేబుల్ బ్రిడ్జిని పూర్తి చేసుకున్నామని, త్వరలోనే మానేరు రివర్ ఫ్రంట్ కూడా పూర్తి చేసుకుంటే ప్రపంచస్థాయిలో కరీంనగర్‌కు ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని సూచించారు. అనంతరం మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ, నగర ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కట్టరాంపూర్‌లోని అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా మార్చుతున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికే పట్టంగట్టాలని, మంత్రి గంగుల కమలాకర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ పాలకవర్గం వచ్చిన తర్వాత నగరంలో వేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. మొదలుపెట్టిన పనులను మధ్యలో వదిలేయకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు ఆకుల నర్మద నర్సయ్య, ఐలేందర్‌యాదవ్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, కోలగాని శ్రీనివాస్, కోల మాలతి, గౌసియాబేగం, జహీరాబాన్, బీఆర్‌ఎస్ నాయకులు నలువాల రవీందర్, సూర్యశేఖర్ ఉన్నారు.

# ధర్మపురి నియోజకవర్గంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల

- ఇథనాల్ ప్రాజెక్టు స్థానంలోనే ఏర్పాటు
- 3న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన

వెల్గటూర్, అక్టోబర్ 1 : రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో ధర్మపురి నియోజకవర్గంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు కానున్నది. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్ జీవో జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపగా, మంజూరైందన్నారు. ఈ కళాశాలను వెల్గటూర్ మండలం స్తంభంపల్లి శివారులో ఇథనాల్ ప్రాజెక్టు నిర్మాణం చేయాలనుకున్న 70 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించనున్నట్లు చెప్పారు. అన్ని సౌకర్యాలతో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి కొద్ది రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధర్మపురి నియోజవకర్గ విద్యార్థులకు ఈ కళాశాల ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. మంత్రి కేటీఆర్ ఈ నెల 3న ధర్మపురి వేదిక వద్ద నుంచి కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# నేడే ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

కరీంనగర్‌లో సుందరంగా ముస్తాబు

- హాజరుకానున్న ప్రముఖ సినీ నటి కృతిశెట్టి



మాట్లాడుతున్న ది చెన్నయ్ షాపింగ్ మాల్ నిర్వాహకుడు మర్రి వెంకట్‌రెడ్డి

విద్యానగర్, అక్టోబర్ 1: కరీంనగర్‌లో సువిశాలమైన పార్కింగ్, లెక్కకు మించిన అతి తక్కువ ధరలతో వస్త్ర వైరైటీలు, అధునాతన హంగులతో రూపొందించిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఘనంగా ప్రారంభం కానున్నది. ఈమాల్‌ను ప్రముఖ సినీ నటి కృతిశెట్టి ప్రారంభించనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, 43వ డివిజన్ కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్ ఇందులో పాల్గొననున్నారు. ఈటీవీ జబర్దస్త్ టీం సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వ రకు 17 షోరూంలలో నాణ్యమైన, నమ్మకమైన ధరలకు వస్త్రాలు, ఆభరణాలు విక్రయిస్తున్నారు. విక్రయాల్లో ఎంతో మంది ప్ర జలకు చేరువైంది చెన్నయ్ షాపింగ్ మాల్ అని, 18వ షోరూం ఉత్తర తెలంగాణ కేంద్ర స్థానంగా ఉన్న కరీంనగర్‌లో ప్రారంభించడం సంతోషంగా భావిస్తున్నామని షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి జనార్ధన్‌రెడ్డి, మర్రి వెంకట్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి జమునారెడ్డి, మర్రి మధుమతి తెలిపారు. నిష్ణాతులైన డిజైనర్లతో రూపొందించిన అధునాతన డిజైన్లతో పట్టు వస్త్రాలను తమ మగ్గాలపై నిష్ణాతులైన చేనేత కార్మికులతో, నిపుణుల పర్యవేక్షణలో నేయించినట్లు వివరించారు.తమ దగ్గర లభించేడిజైన్లు, కలర్ కాంబినేషన్లు ఆడపడుచుల అందాన్ని మరింత ఇనుమడింపజేస్తాయని తెలిపారు.

